28న ఎమ్మెల్యే నల్లమిల్లికి సత్కారం

విశాలాంధ్ర - పెదపూడి/అనపర్తి : కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం, గ్రామ రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో అనపర్తి నుండి బిజెపి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించనున్నట్లు సంఘం అధ్యక్షులు కర్రి త్రినాథ రెడ్డి (అన్నయ్య), యువజన సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం త్రినాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనపర్తి మండలం దుప్పలపూడి ఆర్‌విఆర్ సి(కంటి డాక్టర్) కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని ఈనెల 28 మధ్యాహ్నం 3గంటలకు సత్కరించనున్నట్లు తెలిపారు. ఇచ్ఛాపురం నుండి గుంటూరు వరకు ఎన్నికైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఏకైక ఎమ్మెల్యే నల్లమిల్లి సన్మాన కార్యక్రమానికి పార్టీలకతీతంగా రెడ్డి సోదరులంతా విచ్చేసి విజయవంతం చేయాలని త్రినాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు చింతా గోపాలకృష్ణారెడ్డి, పడాల సుబ్బారెడ్డి, కోశాధికారి మల్లిడి సూరారెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తి వీర్రెడ్డి, గుడిమెట్ల కల్కిరెడ్డి, గొలుగూరి వీర్రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - జగ్గంపేట : పరిసరాలు పరిశుభ్రతపై జగ్గంపేట మండలంలోని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని గ్రామాల్లో ప్రజలకు అవగహన కల్పించేందుకు పరిసరాలు పరిశుభ్రత మనందరి బాధ్యత అంటూ ర్యాలీలు చేశారు. అలాగే సచివాలయాల వద్ద సమావేశాలు నిర్వహించి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - మామిడికుదురు : వరద ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎమ్‌హెచ్‌వో ఎం దుర్గారావు దొర అన్నారు. సోమవారం మండల పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు ఆయన సందర్శించారు. అప్పనపల్లి గ్రామంలో పుష్కర ఘాట్, ఉచ్చుల వారి పేట వద్ద వైద్య శిబిరాలు పరిశీలించారు. వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది ప్రజలకి అందుబాటులో ఉండాలన్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, మంచానికి పరిమితమైన రోగులను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా పాము కాటు, కుక్క కాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు, మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి వెంకటేశ్వర రావు, సెక్రెటరీ ఏస్ సూర్యనారాయణ, సీహెచ్‌వో సత్యవతి, పీహెచ్ఎన్ నారాయణమ్మ, హెల్త్ అసిస్టెంట్ జి యజ్ఞేశ్వర రావు, ఎంఎల్‌హెచ్‌పిలు జి నిఖిత, సిహెచ్ లక్ష్మి నాగ దుర్గ, ఏఎన్ఎమ్‌లు జి శ్రీదేవి, జీ సంతోషి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మకు అభినందనలు

విశాలాంధ్ర - కొవ్వూరు : పిఠాపురం మాజీ శాసన సభ్యులు, తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు చేదోడు వాదోడుగా ఉండి విజయంలో కీలక బాధ్యతలు చేపట్టిన వర్మకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కొవ్వూరు పట్టణ జనసేన అధ్యక్షులు దేగల రాము అన్నారు. సోమవారం వర్మను రాముతో పాటు పార్టీ సీనియర్ నాయకులు గంగుమల్ల. స్వామి, పోలిశెట్టి శివ వర్మను కలిసి ఆయనను అభినందించారు

12 ప్రాంతాల్లో రేపటి నుంచి ఐదురోజులపాటు

ఆధార్ ప్రత్యేక శిబిరాల నిర్వహణ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఐదు రోజులపాటు (ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు) 12 ప్రాంతాలలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ జీ వెంకట రావు చెప్పారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, అప్డేట్ చేసుకోవడానికి మాత్రమే ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు ఆధార్‌కు మొబైల్ నెంబర్ అనుసంధానం చేయడంతో పాటు బయోమెట్రిక్ అప్డేట్ (ఫోటో- ఐరిష్- వేలిముద్ర), పేరు, పుట్టిన తేదీలలో మార్పులు, చిరునామాలో మార్పులు వంటి సేవలను అందిస్తారన్నారు. కాకినాడ సిటీ పరిధిలో కృష్ణ నగర్ 2ఎ, డైరీ ఫారం 11ఏ, గోలీలపేట 14 ఏ, యానం రోడ్డు 15 ఏ, చిన్న మార్కెట్ 21 ఏ, యాళ్ల వారి వీధి 28 బి, జగన్నాయక్‌పూర్ 30ఏ, బ్యాంకుపేట 32 ఏ, సుభాష్ రోడ్ 35ఏ, గాంధీనగర్ 38ఎ, యల్‌బి నగర్ 46బి, గైగోలుపాడు 50బి సచివాలయాల పరిధిలో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత సొమ్ము చెల్లించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్‌ఏఓ పరిశీలన

విశాలాంధ్ర - యానాం : యానాం వృద్ధ గౌతమీ గోదావరి నదికి ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాలలో యానాం ప్రభుత్వాసుపత్రి సిబ్బంది పరిపాలనాధికారి మనిస్వామి, ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవిశంకర్ ఆదేశాల మేరకు ఇప్పటికే ఇంటింటికి వైద్యసేవలు అందిస్తున్నారు. స్థానిక పేర్రి రోడ్ బాల యోగి కాలనీ, వెంకటరత్న నగర్ తదితర ప్రాంతాల్లోని నర్సింగ్ (ఆచీవీ) ఆర్గనైజర్ బడుగు శశికళ ఆధ్వర్యంలో ఏఎన్ఎం సిబ్బంది ఇంటింటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని అనంతరం పారాసెట్మాల్, ఓఆర్ఎస్ పౌడర్లుతో పాటు డయేరియా తదితరు వ్యాధులకు సంబంధించి మందులు అందిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మంచి నీరు కాచి చల్లార్చి వడగట్టుకుని తాగాలని సూచించారు.

ప్రతి సమస్యకూ నాణ్యమైన పరిష్కారం

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి ఒక్క సమస్యకూ నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ వెంకట రావు హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు నగరపాలక సంస్థ కార్యా లయంలో డయల్ యువర్ కమిషనర్ నిర్వహించారు. ప్రజలు ఫోన్ ద్వారా తెలియ జేసిన పలు సమస్యలను కమిషనర్ స్వీకరించారు. ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సం బంధించి 11 మంది, నేరుగా నగరపాలక సంస్థ కార్యా లయానికి వచ్చి కమిషనర్‌కు ఐదుగురు తమ సమస్యలను విన్నవించారు. ప్రధా నంగా కల్పనా సెంటర్లో జరిగిన రహదారి ప్రమాదం నేపథ్యంలో స్పీడ్ బ్రేకర్లు వేయించాలని, వీధిలైట్లు వెలిగించాలని, పశువులు, శునకాల సమస్యను అరికట్టా లని, టిడ్కో గృహాల కోసం చెల్లించిన సొమ్ము వెనక్కు ఇవ్వాలని కోరుతూ ప్రజలు వినతులు అందజేశారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసు కుంటామని కమిషనర్ చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి ఒక్క సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఈ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డీసీపీ హరి దాస్, ఏసీపి నాగశాస్త్రులు, మేనేజర్ సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, ఈఈ మాధవి, పలువురు పాల్గొన్నారు.

సహాయక చర్యలు అందించేందుకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర - పి గన్నవరం : గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో వరద బాధితులకు మెరుగైన వరద సహాయక చర్యలను అందించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన పి గన్నవరం మండలంలోని గంటి పెదపూడి లంక రేవు మీద నుండి పడవపై వెళ్లి లంక గ్రామాల ప్రజలను గోదావరి వరదల కారణంగా ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు గ్రామంలో త్రాగునీటి సమస్యతో తాము ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు స్థానిక ప్రజలు వివరించారు. ముంపు గ్రామాల ప్రజలు ఏ విధమైన ఆందోళన చెందవద్దని ప్రభుత్వ యంత్రాంగం అంతా ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు అందిస్తుందని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. లంక గ్రామాలలో ప్రజలకు గోదావరి వరదలకు సం బంధించి ఏ విధమైన సమ స్యలు ఉన్న వెంటనే స్థానిక అధికారులు దృష్టికి తీసుకు వస్తే వారు పరిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. ఆయా లంక గ్రామాల వద్ద నిర్వహిం చిన వైద్య శిబిరాలను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట కొత్తపేట ఆర్డిఓ ఎన్వివి సత్యనారాయణ, మండల తహశీల్దారు హుస్సేన్, సర్పంచ్ ధంగేటి అన్నవరం, ఎంపీటీసీ పల్లి మోషే, తదితరులు ఉన్నారు.

పెరుగుతున్న గోదావరి ఉధృతి

కోతకు గురైన ఏటిగట్టు...

విశాలాంధ్ర - పెరవలి : రోజు రోజుకు గోదావరి ఉధృతి పెరగటంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన లంకభూములు పల్లపు ప్రాంతాలలో నీట మునిగాయి. గోదావరి నీటి ప్రవాహం మరింత పెరిగినట్లయితే పూర్తిగా లంకభూములు మునిగి పోవడం కాయమని అదే జరిగితే అన్నిరకాల పంటలు మునకకు గురయ్యి రైతులు నష్టపోవడం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో గల పలు గ్రామాలను ఆనుకుని ఉన్న గోదావరి ఏటిగట్టు పలు ప్రాంతాలలో కోతకు గురవ్వడం జరిగింది.గోదావరి ఉధృతి పెరగి ఏటి గట్టుకు నీరు చేరినటయితే ఆప్రదేశాలలో ఏటిగట్టు ప్రమాదానికి గురయ్యే అవకాశం లేక పోలేదు. అధికారులు కేవలం గోదావరి నీటి ప్రవాహం చూడటమే కాకుండా కోతకు గురైన ప్రదేశాలలో ఏటిగట్టు ప్రమాదానికి గురవ్వకుండా ముందస్తుగా చేయాల్సిన పనులను చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ పోరాటం

విశాలాంధ్ర - అమలాపురం : ఏఐటీయూసీ అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ సమావేశం ఉండవల్లి గోపాలరావు అధ్యక్షతన అమలాపురం బండివారిపేట అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ జనరల్ సెక్రటరీ నిమ్మకాయల శ్రీనివాసరావు కార్యకలాపాల రిపోర్టు ఇచ్చారు. ఆ రిపోర్ట్‌లో గత మునిసిపల్ సమ్మె మొదలు నేటి వరకు జిల్లాలో నెలకొన్న కార్మిక సమస్యలు పై సంఘం ప్రభుత్వం అనేక పర్యాయాలు అధికారులు దృష్టికి తీసుకు వెళ్లినా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయని దీని మీద రాష్ట్ర వ్యాప్తంగా సమీక్షించి జిల్లా స్థాయి ఆందోళన కార్యక్రమ చేపట్టవలసి అవసరాన్ని కమిటీ ముందు ఉంచారు. ముమ్మిడివరం నగరపాలక సంస్థలో తొలగించిన కార్మికులు భవిష్యత్తు ప్రశ్న నార్థంగా మారిందని కమిటీ దానిలోతుపాతలను అవగాహనకు వచ్చినది. అదే విధంగా అమలాపురం మునిసిపాలిటీలో మూడు షిఫ్టులు విధానం నడుస్తుందని అయితే తగినంత మంది సిబ్బంది, ఆ సిబ్బందికి మౌలిక వసతులు కల్పించడం కోసం పాలక మండలి స్పందించాలని, చనిపోయిన అవుట్ సోర్సింగ్ కార్మికుల కుటుంబాల నుంచి ఉపాధి కల్పించాలని వికాస్ కార్మికులు 3 నెలల జీవితం బకాయిలు చెల్లించాలని. ఉదాహరణకు రామచంద్రాపురం మునిసిపాలిటీలో జనాభా పెరిగింది. పట్టణం నిర్మాణాలు విపరీతంగా పెరిగింది. నగర కొలతలు లేదా జనాభా నిష్పత్తి ప్రాతిపదికన కార్మికులను నియమించాలి అని జిల్లా కమిటీ అధికారులు ఏపీ మున్సిపల్ వర్క్స్ యూనియన్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ నెలలో 24, 25, తేదీల్లో మదనపల్లిలో జరుపుతున్న మున్సిపల్ వర్కర్స్ శిక్షణా తరగతులకు జిల్లా నుంచి పంపించాలని తీర్మానించింది. ఆగస్టు నెలలో జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో కార్మికుల జనరల్‌బాడీ సమావేశాలు చేసి ఆయా మున్సిపల్ అధికారులను కలిసి మాట్లాడాలి సమస్యలు పరిష్కారానికి కృషి చేదామని తీర్మానించింది. సంతాప తీర్మానం గత జిల్లా కమిటీ నుంచి ఈ సమావేశాల వరకు కామ్రేడ్ రాము సంతాప తీర్మా నం ప్రవేశపెట్టారు. బవిరిశెట్టి బాబి, అయితాబత్తుల జనార్దన, సింగం పల్లి బుచ్చి బాబు, మేకపాటి సుజాత, యనమదల సత్యవతిలకు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

తాళ్లరేవు మండలంలో స్వచ్ఛతా వారోత్సవాలు

విశాలాంధ్ర - తాళ్ళరేవు : తాళ్ళరేవు మండలంలో ప్రతి పంచాయతీలో సోమవారం స్వచ్ఛత కాకినాడ జిల్లా స్వచ్ఛత తాళ్లరేవు స్వచ్ఛ త గ్రామాలుగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆయా పంచాయతీలకు సంబంధించిన పంచాయతీ సిబ్బందితో పాటు ఆయా గ్రామాల వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రతి ఒక్కరికి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నీటమునిగిన రాజోలు కాటన్ పార్కు

విశాలాంధ్ర - రాజోలు : వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో వశిష్ట గోదావరి ఒడ్డున ఉన్న రాజోలు కాటన్ పార్క్ నీట మునిగింది. దీంతో పోలీసులు పర్యాటకులను కాటన్ పార్క్ వద్దకు అనుమతించడం లేదు. రాజోలు మధ్య లంకలో కొబ్బరి తోటలు నీట మునగటంతో రైతు కొబ్బరి రాశులను పడవల్లో ఏటి గట్టుకు చేర్చి అక్కడి నుండి ట్రాక్టర్ల సహాయంతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాజోలు తహశీల్దార్ గోపాలకృష్ణ వరద ప్రభావిత ప్రాంతాలైన రాజోలు నున్న వారి బాడవ, మేకల పాలెం ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళున్నారు. లంకగ్రామాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి సూచించారు.

ప్రతిపౌరుడు బాధ్యతతో మెలగాలి

రెవెన్యూ అధికారి తిప్పేనాయక్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రతి పౌరుడు బాధ్యత వహించి పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకోవాలని, మన చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే ఆరోగ్య దాయకమైన జీవితాన్ని గడప వచ్చని జిల్లా రెవెన్యూ అధికారి డాడి తిప్పేనాయక్ పేర్కొన్నారు. స్వచ్ఛత వారోత్సవాలను పురస్కరించుకుని డీఆర్వో తిప్పే నాయక్, కాకినాడ మున్సిపల్ కమిషనర్ జె వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్య నారాయణ, ఇతర అధికారులతో కలిసి సోమవారం కాకినాడ వివేకానంద పార్క్ నుంచి స్వచ్ఛత అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో స్థానిక ప్రజా ప్రతినిధులు, రెడ్ క్రాస్, వివిధ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్, ఎన్.సీ.సీ విద్యార్థులు, మెప్మా, ఏఎన్ఎం ఇతర సిబ్బంది పెద్ద ఎత్తున హాజరై, ఒకటే మాట-పరిశుభ్రత బాట, ప్లాస్టిక్ తో ఆట-ప్రాణానికి తూటబీ చెత్తవేసే చోటు కాదిది-నలుగురు నడిచే దారిది, పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం- అంటువ్యాధులను తరిమేద్దాంబీ అంటూ నినాదాలతో కలెక్టరేట్ లోపలికి చేరుకున్నారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తను సేకరించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ పీ సత్యకుమారి, ఎంహెచ్వో డా డి పృథ్వీచరణ్, రెడ్ క్రాస్ సంస్థ కార్యదర్శి కె శివ కుమార్‌బీ పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బివి తిరుపాణ్యం, మెప్మా సిబ్బంది, పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆదిత్య కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు 'శిక్షసప్తహ' దోహదం

విశాలాంధ్ర - రాజానగరం : విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిన సృజనాత్మకతను వీలికి తీసేందుకు ఇటువంటి వేడుకలు దోహద పడతాయనీ మండల విద్యశాఖాధికారులు ఎం.రామన్న దొర,గుబ్బల జ్యోతి ప్రసాద్ అన్నారు.శిక్ష సప్తహ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సూర్యారావు పేట గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల నందు శిక్ష సప్తహ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ వస్తు ప్రదర్శనశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ప్రతి పాఠశాలలో శిక్ష సప్తహ అనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పాఠశాలలో వారం రోజులుపాటు వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ నెల 22 నుండి నుండి 29 వ తేదీ వరకు ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమములు జరుగుతాయని చెప్పారు. ఉపాధ్యాయులందరూ విద్యార్థులను ప్రోత్సహించి ఈ కార్యక్రమాలు విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లైస్ వినియోగదారుల సమాఖ్య ఆధ్వర్యంలో

ప్రభుత్వ ధరకు, ఆహార పథకాలపై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ : తూనికలు, కొలతలు సివిల్ సప్లైస్ వినియోగదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏర్పాటు చేసిన ధరకు ఆహార పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ జిల్లా తూనికలు కొలతలు అసిస్టెంట్ కంట్రోలర్ సలీం ఇనస్పెక్టర్ సరోజినీ, సివిల్ సప్లైస్ విజిలెన్స్ అపర్ణ, వినియోగ దారుల సమాఖ్య జాయింట్ సెక్రటరీ డిసిపిసి మెంబర్ కొమ్మూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాకినాడ సర్పవరం జంక్షన్ స్పెన్సర్ ఔట్ లెట్‌లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తక్కువ ధరకే సరకులు నాణ్యమైన సోనా మసూరి, బిపిటి రైస్ స్టీమ్ 49/- పచ్చి సోనా మసూరి బిపిటి 48/- దేశవాళీ కందిపప్పు 169/- స్టాల్ సందర్శించి సరకు నాణ్యత తూకం తనిఖీ చేసి అక్కడ వున్న వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో అన్ని స్టాల్స్‌లో ఈ పథకం పై వినియోగ దారుల రక్షణ సమాఖ్య వారి సహకారంతో అవగాహన కల్పిస్తూ ఈ పథకానికి వ్యాపారస్తులు కూడా మద్దతు ఇస్తూ అన్ని సరకులు అమ్మకాలతో పాటు ఈ రైస్, కంది పప్పు అమ్మి పేద మధ్య తరగతి కస్టమర్స్ కోసం కృషి చేయాలని కోరారు.

అర్హత ఉన్న ప్రతి అర్జీని సత్వరం పరిష్కరిస్తాం

కలెక్టర్ మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్హమైన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. సోమవారం పిఠాపురం రథాల పేట అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో పిఠాపురం నియోజక వర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్.. అధికారులతో కలిసి హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీక రించాలను ఆయాశాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తి కర మైన పరిష్కారాలు అందించాలని మండలం, డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం-506 అర్జీ లు అందగా, వీటిలో ప్రధానంగా రెవెన్యూ, పిం ఛన్ల మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల తప్పనవిగా ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సూచనల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతి రెండు వారాల కొకసారి నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్ర మంలో అందిన అర్జీలను సకాలంలో పరిష్కరిం చేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించి ఆన్ లైన్‌లో నమోదు చేయాలని ఆయన అధికారు లను ఆదేశించారు. పరిష్కారాల ప్రదారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలన్నిటినీ త్వరలో పరిష్కారిస్తామని ఒకసారి అర్జీ సమర్పించిన వారు మరల మరల పరిష్కారం కార్యక్రమానికి రానవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి జి శ్రీనివాస రావు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు పి నారాయణమూర్తి, ప్రసాదరావు, పిఠాపురం, గొల్లప్రోలు కమిషనర్లు ఎస్ కనకరావు, టి రవికుమార్‌బీ పిఠాపురం, గొల్లప్రోలు తహసీల్దార్లు కె లక్ష్మి, ఎం ఉదయభాస్కర రావు వివిధ శాఖల అధికారులు, పిఠాపురం నియోజవర్గ జనసేనా నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఉద్యానవన పంటల పై రైతులకు సూచనలు

విశాలాంధ్ర - సీతానగరం: వరద ఉధృతి తగ్గగానే ఉద్యానవన పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై మండల ఉద్యానవన శాఖ అధికారి పి రిని రైతులకు సూచనలు ఇచ్చారు. సోమవారం మండలంలో చినకొండేపూడి, సీతానగరం గ్రామాల్లో ఉద్యానవన పొలాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా రైతులకు తగు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా రిని రైతులతో మాట్లాడుతూ పొలాలలో నిలిచిన వరద నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపించేయాలి. వర్షాలు తగ్గిన వెంటనే మూడు 19లు లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలు పంట పై పిచికారి చేయాలి. అలాగే కాకర, బీరా, దొండ వంటి కూరగాయల పాదుల రకాల పంటలు పై బూజు తెగులు రాకుండా మెటలాక్సిల్ ప్లస్, మ్యంకోజెబ్ రెండు మందులు 2 గ్రములను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని అన్నారు. అరటిలో కూడా యూరియా, మర్యరెట్ ఆఫ్ పోటీష్ ను రెండు 80,20 గ్రామాల మోతాదులో కలిపి 20 నుండి 25 రోజుల కాల వ్యవధిలో 2 లేదా 3 సార్లు వేసుకోవాలని రైతులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి సౌమిత్రి, వి ఎచ్ ఏలు ఆశికా, ప్రియ, రైతులు పాల్గొన్నారు.

ఇంటి గోడ కూలి.. మహిళలకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - గోపాలపురం : గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి గోడ కూలి మహిళ కు తీవ్ర గాయాలు పాలైన సంఘటన మండలంలోని సగ్గొండ గ్రామపంచాయతీలో చోటుచేసుకుంది. స్థానికులు గ్రామ సర్పంచ్ ఎండపల్లి కవితా శేఖర్ బాబు తెలిపిన సమాచారం మేరకు సగండ గ్రామపంచాయతీ పరిధిలోని గోపవరం గ్రామంలో లోని బీసీ కాలనీలో మేకాని సుబ్బలక్ష్మి అనే మహిళ కుటుంబం బంగాళా పెంకుటిల్లు లో నివాసం ఉంటున్నారు. యధావిధిగా ఆదివారం నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి వేళ ఇంటి ప్రధాన గోడ కూలి మహిళపై పడతో తీవ్ర గాయాల పాలైన ఆమెను సాయి ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు స్థానికులు చేయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ ఎండపల్లి కవితా శేఖర్ బాబు ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి మెరుగైన వైద్యం కోసం తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

తొగరు షణ్ముఖ్ దేవీనాథ్‌కు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తొగరు శ్రీనివాస్ కుమారుడు షణ్ముఖ్ దేవీనాథ్ కాకినాడలో నిర్వహించిన 30వ ఇంటర్ క్లబ్ తైక్వాండో ఛాంపియన్ షిప్ 2024లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించినట్లు తైక్వాండో జిల్లా సంఘం కార్యదర్శి బి అర్జున్ రావు తెలియజేసారు. చి షణ్ముఖ్ దేవీనాథ్ పతకం సాధించిన విషయం తెలుసుకున్న ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి షణ్ముఖ్‌ను అభినందించారు. పిల్లలకు చదువుతో పాటు వారి ఆసక్తిని గమనించి ఆయా రంగాలలో ప్రోత్సహించడం ఎంతో అవసరం అని అన్నారు. శ్రీనివాస్ తమ కుమారుడు షణ్ముఖ్‌ను ఈ విధంగా ప్రోత్సహించడం అభినందనీయం. థైక్వాండో క్రీడలు శారీరక దృఢత్వానికి కాకుండా ఆత్మరక్షణకు ఎంతో దోహదపడతాయి అని తెలిపారు. ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ స్థాయి 50 కిలోల విభాగంలో తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరచిన చి షణ్ముఖ్ దేవీ నాథ్‌ను తండ్రి శ్రీనివాస్‌ను డీన్‌లు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌లు, గ్రంథాలయ అధికారి కె అశోక్ కుమార్, జాతీయ పర్యావరణ మిత్ర టి గంగాధర్, ఆదిత్య సిబ్బంది అభినందించారు.

రైతులు నష్ట నివారణ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - కరప : అల్పపీడనం కారణంగా వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి పంట పొలాలు నీట మునిగి రైతుని పుట్టడు దుఃఖంలో ముంచేత్తాయి. లోతట్టు ప్రాంతాల్లో పూర్తిగా దెబ్బ తిన్న వరి పొలాలు మరోసారి విత్తుకోవాల్సిందేనని మండల వ్యవసాయ అధికారి ఏవో రాజేష్ పేర్కొన్నారు. కరప మండలం యండమూరి గ్రామంలో జిల్లా వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ విజయ్ కుమార్, ఏడిఏ బాబురావు ఆధ్వర్యంలో పంట పొలాలను పరిశీలించామని ఏవో రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా జెడి విజయకుమార్ మాట్లాడుతూ రైతులు చిగుళ్ళు కనిపిస్తున్న వరి పొలాలలో నష్ట నివారణ చర్యలు చేపట్టుకోవాలని రైతులకు సూచనలు సలహాలు అందించారు. ఊడ్చిన మాటలలో నీటిని తొలగించి ఎకరాకు 20 కేజీల డిఏపి, 20 కేజీల ఫొటాస్ కలిపి మడులలో జల్లుకోవాలన్నారు. నారుమడులలో అయితే ఐదు సెంట్లు నారుమడులకు ఒక కేజీ యూరియా ఒక కేజీ పొటాష్ కలిపి జల్లుకోవడం వలన వరి నష్టం నివారించవచ్చు అన్నారు. దుబ్బుకుల్లు రాకుండా కార్బన్డిజం లీటర్ నీటికి ఒక గ్రాము చెప్పిన కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యండమూరి గ్రామ సర్పంచ్ మారెళ్ళ శ్రీనివాసరావు రైతులు తదితరులు పాల్గొన్నారు.

450 హెక్టార్లలో పంట మునక

పరిశీలించిన వ్యవసాయశాఖాధికారి ఇమామిఖాసిం

విశాలాంధ్ర - రాజానగరం : రాజనగరం మండలంలో గత నాలుగు రోజుల నుండి అల్పపీడనంతో కురుస్తున్న అధిక వర్షాలకు వివిధ దశలలో ఉన్న వరిపంట సుమారు 450 హెక్టార్లు ముంపునకు గురైందని మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్‌కె ఇమామిఖాసిం అన్నారు. మండలంలోని కలవచర్ల, కొండగుంటురు, నామవరం, జి.ఎర్రంపాలేం గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను వ్యవసాయ శాఖాధికారి సోమవారం పరిశీలించారు. దీనిలో భాగంగా అక్కడి రైతులకు పలు సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపుకు గురైన వరి పొలాల్లో నారుమడిలో నుండి ఐదు రాజులోగా నీరు పూర్తిగా బయటకు తీసివేయాలన్నారు. ఐదు సెంట్ల నారుమడికి కిలోయూరియా, కిలోపొటాష్ ఎరువులను వేసుకోవాలన్నారు. అదే విధంగా ఒక గ్రాము కార్బెన్డిజమ్ లేదా 2 గ్రాముల కార్బెన్డిజమ్, మాంకో టె బన్ను పిచికారి చేసుకోవాలనీ చెప్పారు. పిలక దశలో వరిపంట మునిగితే నీరు బయటకు పూర్తిగా తీసిన తర్వాత ఎక రానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకోవాలని తెలిపారు.

ఒరిజినల్ సర్టిఫికేట్స్ మరియు పాస్‌పోర్ట్ పోయినవి

నా ఒరిజినల్ యస్.యస్.సి (రోల్ నెం: 1209102217), ఒరిజినల్ ఇంటర్ మీడియట్ (రోల్ నెం: 1405219731) సర్టిఫికెట్స్ మరియు ఒరిజినల్ పాస్‌పోర్ట్ (V.R.N NO: 17-1009048699, File No: V.S 1060561543717), ది. 16-07-2024 తేదీన కొవ్వూరు పట్టణంలో జిరాక్స్ కాపీలు తీసుకొనుటకు వెళ్ళుచుండగా మార్గమధ్యలో పోయినవి. సదరు డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికిన యెడల ఈ అడ్రస్‌కు అప్పగించవలసినదిగా కోరడమైనది.

అడ్రస్: నీరుకొండ దత్తు చౌదరి, దొమ్మేరు గ్రామం, కొవ్వూరు మండలం తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఫోన్ నెం: 9392704152.

వైద్య శిబిరాన్ని సందర్శించిన జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-కుక్కునూరు: గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో మెరుగైన వైద్యాన్ని అందుబాటులో ఉంచేందుకు పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్టు జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి తెలిపారు. దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలోని పునరావాస కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించారు. వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను ఆరా తీస్తూ అక్కడ ఉన్న మందులను పరిశీలించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారికి ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. ఏమైనా అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి అంబులెన్స్‌లో సమీప పిహెచ్ సి లేదా జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లాని సూచించారు.

గోస్తని నదికి గండి

కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-పాలకోడేరు: గోస్తని నదికి గండిపడి ముంపునకు గురైన గుత్తులవారి పాలెం ఎస్టీ కాలనీలో కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి కాలనీ వాసులకు ధైర్యం చెప్పారు. ఆదివారం రాత్రి గోస్తని నదికి గండి పడిందని తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హుటాహుటిన పాలకోడేరు మండలం మోగల్లు గ్రామం గుత్తులవారి గ్రామానికి చేరుకుని గండి పడిన ప్రాంతాన్ని కట్టడి చేసేందుకు యుద్ధ ప్రాతిపదిక అధికారులను ఆదేశిస్తూ పర్యవేక్షించారు. సోమవారం గుత్తుల వారి పాలెం ఎస్.టి.కాలనీలో ఉన్న ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ నీకు ఆధార్ కార్డులు ఉన్నాయా, రేషన్ అందుతుందా, ఎవరికైనా అనారోగ్యం ఉందా, మీ మగ వారు ఏం చేస్తారు, మీరు ఏం చేస్తారు అని ఆరా తీశారు. కాలనీ వాసులు బదులిస్తూ ఆధార్, రేషన్ కార్డులు ఉన్నాయని బదులిచ్చారు. మగవారు చేపలు పడతారని, మేము చేపలు అమ్ముతామని తెలిపారు. త్రాగునీటికి ఇబ్బందిగా ఉందని, డ్రైనేజీ లేక ఇబ్బంది పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. నివాస ప్రాంతాల వరకు నీరు రావడం వలన పాములు, తేళ్లు వచ్చే అవకాశం ఉందని, పాముకాటుకు అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శ్రీనివాసులు రాజు, పాలకోడేరు ఎంపీడీవో అనూహ్య, రెవెన్యూ, సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎం, తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి వైద్యులు సహకరించాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో వైద్యులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజక వర్గ అభివృద్ధి మినహా ఒక్క రూపాయి అడగనని గూడెంను సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. తాడేపల్లిగూడెంలో లక్షలాది రూపాయలు వసూలు చేసే వైద్యులు లేరని పేర్కొన్నారు. 70-80 లక్షల రూపాయలతో వైద్యులు ఇండోర్ స్టేడియం నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. తాను మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు తాడేపల్లిగూడెంలో స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ పార్క్ వంటి వాటిని నిర్మించినట్టు తెలిపారు. తన సొంత నిధులు కోటిన్నరతో అభివృద్ధి చేశానన్నారు. సేవకు తన జీవితాన్ని అంకితం చేస్తానని పార్టీలో ఐదేళ్లపాటు తాను జనంలో ఉండి సేవ చేశాననీ, ప్రజలు తనను గెలిపించి మరింత బాధ్యత పెంచి ,చట్టాల గురించి రాష్ట్రంలో మాట్లాడే హక్కు తనకు ప్రజలు కల్పించారన్నారు. వచ్చే రోజుల్లో గోదావరి ఏలూరు కాలువ గట్టు పరిరక్షణలో భాగంగా తాడేపల్లిగూడెం ఖ్యాతిని ఇనుమడింపజేసిన కోడె వెంకట్రావు, రేలంగి వెంకట రామయ్య, డాక్టర్ పి ఎల్ వి ప్రసాద్ వంటి మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డి, డాక్టర్ కనకమహాలక్ష్మి, డాక్టర్ చిట్యాల రవి మాధవ్, డాక్టర్ శశికాంత్, డాక్టర్ కర్రి భాస్కరరావు, ఐఎంఏ వైద్యులు పాల్గొన్నారు.

కళాకారులకు సహకారం అందిస్తా

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలో త్వరలో మున్సిపల్ టౌన్ హాలు నిర్మిస్తామని, కళాకారులకు పూర్తి సహకారం అందించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలుగుదేశం పార్టీ తాడేపల్లి గూడెం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) పేర్కొన్నారు. స్థానిక బివిఆర్ కళా కేంద్రం ఆధ్వర్యంలో వాసవి ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణకు గౌరవ సత్కార సభ జరిగింది. ఈ సభలో వలవల మల్లికార్జున రావు (బాబ్జి) మాట్లాడుతూ కళాకారుల పింఛన్ల సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. కళాకారుల ఉన్నతికి బుద్ధాల రామారావు చేస్తున్న కృషిని అభినందించారు. సభకు బివిఆర్ కళా కేంద్రం వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ నాటక పరిషత్తు సమైక్యల అధ్యక్షులు బుద్ధాల రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిడదవోలు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాయకులు పాలని ఉదయభాస్కర్ శ్రీధర్‌ను సత్కరించి శాలువాతో గౌరవ సత్కారం చేశారు. ఈ సభలో సినీ రచయిత రసరాజు, పాల్వంచ తిరుమల వెంకన్న, ఆడిటర్ రమణ, వాసవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రత్నాకర్‌రావు, అపుస్మా పూర్వాధ్యక్షులు సుంకర శ్రీనివాస్, వాసవి ఇంజనీరింగ్ కళాశాల కోశాధికారి పేరూరి బాల కాశయ్య, వాసవి క్లబ్ అధ్యక్షులు నున్న ఆనంద, నున్న చైతన్య, నున్న సుందరం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి రవి అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేద కళాకారుని సత్కరించి 55 వేల రూపాయలు నగదు అందజేశారు. హార్మోన్ ఆర్టిస్ట్ రమణారావును సత్కరించి ఆర్థిక పారితోషికాన్ని అందజేశారు.

34రోజుకు చేరిన అన్న క్యాంటీన్

విశాలాంధ్ర - కైకలూరు: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన రోజు నుండి కైకలూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు డొక్కా సీతమ్మ స్ఫూర్తితో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ 23 రోజుకు చేరింది సోమవారం అన్నదాతగా గణపవరం మండలం అర్ధవరం గ్రామానికి చెందిన ఎస్. వెంకట్ రాజు ఆర్థిక సహాయంతో సుమారు 400 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కైకలూరు నియోజకవర్గ జనసేన నేత కొల్లి వరప్రసాద్ (బాబీ), తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పులా రాజి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ మీద అభిమానంతో ఆయన ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రోజు నుండి కైకలూరు శాసనసభ్యులు మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు దాతల సహాయంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ 34 రోజుకు చేరుకోవ డం చాలా ఆనందంగా ఉందని దాతలు మరొక్కసారి అభినందిస్తున్నామని తెలి పారు. కైకలూరు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పెనుమచ్చ త్రినాధ్ రాజు, కైకలూరు ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, పెరిచేర్ల వినయ్ వర్మ,పుప్పాల సూర్యప్రకాష్, అద్దంకి రమేష్ రాజు, నాని రామాయణం కొండలరావు,తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం

విశాలాంధ్ర -భీమవరం: పట్టణంలోని మెంటేవారితోట, దుర్గాపురంలోని ముంపు ప్రాంతాల్లోని బాధితులను ఆదుకుంటామని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి అన్నారు. కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టీడీపీ బీసీ సాధికారిత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు సౌజన్యంతో 300 మంది బాధితు లకు సోమవారం భోజనాలను అందించారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ వర్షాలతో యనమదుర్రు డ్రైన్‌కు ఇరువైపులా ఉన్న లోతట్టు ప్రాంతా నివాసాలలో నీరు చేరడంవల్ల వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ముంపు లేకుండా శాశ్వత పరిష్కారానికి ఎన్డీఏ ప్రభుత్వం దృష్టికి ముంపు ప్రాంతాల సమస్యలను వివరించి ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గంట త్రిమూర్తులు, మాజీ కౌన్సిలర్లు ఎద్దు ఏసుపాదం, మెంటే గోపి, మైలబత్తుల ఐజాక్ బాబు, మద్దుల రాము మాట్లాడుతూ మరో రెండు రోజులపాటు బాధితులకు అవసరమైన భోజనాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసీమా బేగం, ఎండి షబీనా, తోట సురేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

వరద విపత్తులో సురక్షిత ప్రసవం

విశాలాంధ్ర-కుక్కునూరు: భారీ వర్షాలు, వరదల కారణంగా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశాల ప్రకారం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 28 మంది గర్భిణీలు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో, సమీప పిహెచ్ సిలో చేర్పించారు. ఈనెల 21వ తేదీన కుక్కునూరు మండలం చీపురుగూడెంకు చెందిన సోదేం అనిత, పుల్లపగూడెంకు చెందిన బి.అరుణ, ఈనెల 22వ తేదీన చీపురుగూడెంకు చెందిన మడకం దేవమ్మ పండంటి బిడ్డలకు జన్మనిచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో గర్భిణీలను గుర్తించి వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించడంలో జిల్లా యంత్రాంగం తీసుకొన్న చర్యలపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం తీసుకున్న చొరవ మూలంగా జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో వరద ముంపు ప్రాంతాల్లో ఉన్న గర్భిణీలలో నెలలు నిండిన మహిళలను ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో సుఖప్రసవాలు పొందారు. కష్టకాలంలో కొండంత అండగా నిలిచిన ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి ఆయా కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి.

ముంపునకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర -భీమవరం: పట్టణంలోని యనమదుర్రు డ్రైన్ ముంపు బాధితులను మాజీ ఎఎంసి చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షులు చెనమల చంద్రశేఖర్ సోమవారం పరిశీలించి సహాయ పునరావాస కార్యక్రమాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బాధితులకు జరిగిన నష్టం తాలూకు వివరాలు అడిగి తెలుసుకుని పార్టీ తరపున, ప్రభుత్వం తరపున అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. భవిష్యత్తులో యనమదుర్రు డ్రైన్ వరద పట్టణంలోకి రాకుండా శాశ్వత పరిష్కారం చేపడతామని ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు ముచ్చకర్ల సుబ్బారావు, ఎద్దు ఏసుపాదం, అనపర్తి కృష్ణ ప్రసాద్, గోపి, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, తోట సురేష్, పానకాల శ్రీను, చిన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధమైన శ్రమ విజయానికి పునాది

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రణాళికా బద్ధమైన శ్రమయే విజయానికి పునాది అని బంజారా బజరంగీ భేరీ జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ తెలిపారు. టి నరసాపురం పంచాయతీ లోని కృష్ణాపురం గ్రామంలో బంజారా బజరంగీ భేరీ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ వృత్తి కోసం శిక్షణ పొందుతున్న 30మంది అభ్యర్థులకు 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చే ఆయుధం విద్య అని, ఈ పోటీ ప్రపంచంలో నిలబడాలంటే ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలి అన్నారు. కష్టపడటంతో పాటు ఇష్టపడి చదివిన వారే విజయం సాధిస్తారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, ఒక దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుని చేతుల్లోనే ఉంటుందని అన్నారు. కష్టపడి చదివి ఉపాధ్యాయ వృత్తిని సాధించాలని అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భూక్యా వేణు గోపాల్, జరభల కృష్ణ ప్రసాద్, భూక్యా బిగనాధం, భూక్యా శ్రీనివాస్, ధరావత్ రవి, చంటి నాయక్, ధరావత్ బంగారయ్య, హసావత్ రవింద్ర, తేజావత్ రామకృష్ణ, భూక్యా రామకృష్ణ, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

జన సైనికులకు భద్రత

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : జన సైనికుల భద్రతకు వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు క్రియాశీలక సభ్యత్వం ఎంతగానో ఉపయోగ పడుతుందని జనసేన పార్టీ కొయ్యల గూడెం మండల అధ్యక్షుడు తోట వీర వెంకట సత్యనారాయణ (రవి)పేర్కొన్నారు. మండలంలో దిప్పకాయల పాడు గ్రామానికి చెందిన బల్లె నాగ లక్ష్మీ శివకుమారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె కుటుంబా నికి జనసేన పార్టీ తరపున మంజూరు చేసిన ఐదు లక్షల రూపాయల చెక్కును మంగళగిరిలో జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు చేతుల మీదుగా అందజేయడం జరిగిందని రవి తెలిపారు. జిల్లా సంయుక్త కార్యదర్శి పాదం నాగ కృష్ణ సమక్షంలో ఈ ఐదు లక్షల రూపాయలు చెక్కును బాధిత కుటుంబానికి అందజేయడం జరిగిందని అన్నారు. పార్టీ తరపున బీమా రావడానికి కృషిచేసిన పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు చిర్రి. బాలరాజుకు, పాదం. నాగకృష్ణకు, తోట.రవి కి, బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటమి నుండి గుణపాఠం నేర్వని జగన్

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : జగన్‌కు రాష్ట్ర ప్రజలు ఓటు రూపంలో బుద్ధి చెప్పినా మారలేదుని, జగన్ మోహన్ రెడ్డి నీ ప్రవర్తన మార్చుకో అని టిడిపి మండల అధ్యక్షులు పారేపల్లి నరేష్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. శవ రాజకీయాలు అలవాటుగా మారిన జగన్ ప్రజాస్వామ్యం కూని అయ్యిందంటూ ఎన్డీఏ ప్రభుత్వం పై విమర్శలు మానుకోవాలని నరేష్ హెచ్చరించారు. దమ్ము ధైర్యం ఉంటే జగన్ బాబాయి హత్య కేసు విషయంలో ఢిల్లీలో ధర్నా చేయాలని, దళిత సోదరుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన అనంతబాబుని శిక్షించాలని ధర్నా చేయాలని నరేష్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన సుమారు 45 రోజుల్లో అనేక పథకాలు అమలు చేయడం చూసి తట్టుకోలేక, జగన్ విమర్శలు చేస్తున్నాడని నరేష్ పేర్కొన్నారు.పెన్షన్స్ పంపిణీ, ఉచిత ఇసుక, డీఎస్సీ నోటిఫికేషన్, అన్నా క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట రద్దు, వైయస్సార్ ప్రభుత్వంలో దగాపడ్డ రైతన్నలకు 1100 కోట్లు విడుదల చేయటం అభివృద్ధికి నిదర్శమని నరేష్ తెలియజేశారు.

పోలవరం ప్రాజెక్టు నిధులు మంజూరు చేయండి

జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు వినతి

విశాలాంధ్ర - ఏలూరు : ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి పాటిల్ కు విజ్ఞప్తి చేశారు. సోమవారం న్యూఢిల్లీ శ్రమశక్తి భవన్ లో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి రామా నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఇతర ఎంపీలతో కలిసి జలశక్తి మంత్రి సిఆర్.పాటిల్ ని కలసి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయటానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దానికి మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

గోదావరి ఉధృతి దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-నర్సాపురం: పట్టణంలోని పంటి రేవు, పొన్నపల్లి వద్ద వశిష్ట గోదావరి ఏటి గట్టును నర్సాపురం శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ సోమవారం పరిశీలించారు ఈ సందర్భంగా నాయకర్ ఏటిగట్టు పొడవునా నడిచి, గట్టును పరిశీలిస్తూ, గట్టు నాణ్యత పై సందేహాలను ఏటిగట్టు పరిరక్షణ శాఖ అదుకారులను అడిగి తెలుసుకున్నారు. పంటి రేవు, బుడ్డిగ వారి రేవులను పరిశీలించి, ఇటీవల కాలంలో జరిగిన ఏటిగట్టు పనులను పరిశీలించారు. గోదావరి నీటి ప్రవాహాన్ని చూసి వరద ప్రభావం పై అధికారులను ప్రశ్నించారు. అధిక వర్షాల వలన ఎగువ నుండి నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందువలన గోదావరికి వరద వచ్చే సూచనలు ఉన్నాయని, ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎంత పెద్ద వరద వచ్చినా తట్టుకునే విధంగా, ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వర్షాల వలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని, డయేరియా, కలరా వంటి అంటు వ్యాధులు సోకకుండా ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి, తగు ఏర్పాట్లు చేసుకుని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్షాలు, గోదావరి నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో మత్స్యకారులు ఎవ్వరూ వేటకు వెళ్లకుండా అధికారులకు సహకరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. వెంకటేశ్వరరావు, ఏటిగట్టు పరిరక్షణ శాఖ అధికారులు, జనసేన, టిడిపి, నాయకులు మరియు బిజెపి నాయకుల పాల్గొన్నారు.

స్వల్పకాలిక రకాలు అనుకూలం

విశాలాంధ్ర-వీరవాసరం: ముంపునకు గురైన పొలాల్లో నీరు తగ్గిన వెంటనే స్వల్పకాలిక వరి వంగడాలనే రైతులు సాగు చేయాలని భీమవరం సహాయ వ్యవసాయ సంచాలకులు చింతల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మండల వ్యవసాయ అధికారి బిన్నీబాబుతో కలిసి వీరవాసరం, మేంటేపూడి, బాలేపల్లి, మత్స్యపురి, బొబ్బనపల్లి గ్రామాలలో పర్యటించి ముంపుకు గురైన నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపునకు గురైన నారుమడులను రక్షించుకోవడంలో రైతులు, వ్యవసాయాధి కారుల సూచనలు పాటించి నారుమడులను సంరక్షించుకోవాలని రైతులకు సూచించారు. వర్షాలు తగ్గిన నేపథ్యంలో చేలల్లో నీటిని బయటకు తోడించాలని, అప్రమత్తంగా వ్యవహరించి రక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. నారుమడిలో నీరు బయటకు తీసిన తరువాత కార్బెండిజం 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. నారుమడికి చుట్టూ బోదులు తీసుకోవాలని రైతులను కోరారు. 5 సెంట్లు నారు మడికి యూరియ 2 కేజీలు, 1 కేజీ ఎరువును నారుమడిలో పోటాష్ కలిపి వేసుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే నారుమడులలో ఎక్కడైతే ముంపుకు గురై పాడైపోయిన వాటిచోట స్వల్పకాలిక రకాలైన ఎం.టీ.యు 1156, ఎం.టీ.యు 1153 విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటుందని రైతులకు తెలియజేశారు. మండల వ్యవసాయాధి కారులు, సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు. వారితో పాటు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మెదడు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ : మెదడు వ్యాధులపై అవగాహన కలిగి ఉండటంతో ఆటు వ్యాధి నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రైల్వే హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సౌరిబాల సూచించారు. 'ప్రపంచ మెదడు దినోత్సవం' సందర్భంగా సోమవారం రైల్వే హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఎంఎస్ మాట్లాడుతూ సమాజంలో నివారణ చర్యలను ప్రోత్సహించడానికి ఒక ముఖ్యమైన అడుగు.మెదడు రుగ్మతలు ప్రపంచంలో అత్యంత ఖరీదైన వ్యాధులలో ఒకటి వైకల్యం,మరణాలకు ప్రధాన కారణం అయినప్పటికీ, ఇతర వ్యాధులతో పోలిస్తే నివారణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.ప్రధాన వ్యక్తగా రమేష్ హాస్పిటల్ నుండి విచ్చేసిన న్యూరోఫిజిషియన్. డా. పి.బి. ప్రశాంత్ బాబు మాట్లాడుతూ మెదడు ఆరోగ్యం, స్ట్రోక్, మూర్ఛ,చిత్తవైకల్యం వంటి నరాల సంబంధిత రుగ్మతల క్లిష్టమైన అంశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మెదడు సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి సరైన పోషకాహారం, తగినంత నిద్ర,ధ్యానం,స్క్రీన్ సమయాన్ని పరిమితం చేయడం వంటి జీవనశైలి మార్పులతో సహా నివారణ వ్యూహాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎసిఎంఎస్ డాక్టర్ ఎం. జైదీప్,తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించండి : ఉపాధి కూలీలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం అవురుపూడి గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'(మీకోసం)లో సచివాలయ కార్యదర్శి శిరీష కు ఉపాధి హామీ కార్మికులు తమడిమాండ్లపరిశీలనకై వినతి పత్రం అందజేశారు. ఉపాధి హామీ కార్మికులు ఈ వేసవి కాలంలో పనిచేసిన 8 వారాల పనికి రావాల్సిన బకాయి వేతనాలు ఇప్పటివరకు ఒక రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదని , వేతనాలు రాకపోవడంతో తినడానికి ఇబ్బంది పడుతున్నామని, రావాల్సిన బకాయిలు వెంటనే ఇప్పించటానికిచర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి కార్మికులకు ఉపాధి కూలీల పెండింగ్ వేతనాన్ని వెంటనే చెల్లించి , కనీస వేతనం రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 200 పని దినాలు కల్పించాలని, ఉపాధి హామీ పథకానికి వ్యవసాయాన్ని అనుసంధానం చేయరాదని, చేసిన పని దినానికి పే స్లిప్పులు తమకు ఇవ్వాలని, గ్రామపంచాయతీ అధికారులుప్రతిపాదించిన ప్రతిపనిని ఆమోదించిపని చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి శీలం నారాయణ డిమాండ్ చేశారు.

దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలోని పునరావాస కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-వేలేరుపాడు: వేలేరుపాడు మండలం గొమ్ముగూడెంకు చెందిన వరద బాధితులకు ఏర్పాటు చేసిన దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలోని పునరావాస కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, ఐటిడిఎ పివో యం. సూర్యతేజ లతో కలిసి సందర్శించారు. ఈ సమయంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పునరావాస కేంద్రంలో సదుపాయాలపై అక్కడవున్న వారిని ఆరా తీసిన సమయంలో గొమ్ముగూడెం కు చెందిన సీనియర్ సిటిజన్ డి. సత్యం పునరావాస కేంద్రంలో సదుపాయాలు బాగున్నాయని, మీరు నియమించిన అధికారులు తమను కంటికి రెప్పలా చూసుకుంటున్నారని కలెక్టర్ కు తెలిపారు. 1986లో గోదావరి వరదల సమయంలో మీరు ఉన్నారా అని కలెక్టర్ ప్రశ్నించగా అప్పటినుండి ఇక్కడే ఉన్నామని తెలపగా గోదావరి వరదలకు సంబంధించి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. కోటగిరి నవీన్ మాట్లాడుతూ గోదావరి వరద హెచ్చరికల ముందునుంచే అధికారులనంతా అప్రమత్తం చేయడం ఎంతో ఉపయోగపడ్డదని చెప్పారు. త్రాగునీటి గానీ ఇతర సదుపాయాల విషయంలోగాని అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. రాత్రి 12 గంటల వరకు తమను అంటిపెట్టుకునే ఉంటున్నారన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ అధికారుల నుంచి ఇంకా సహకారమవసరమైతే అందిస్తామని అదే విధంగా మీగ్రామాల్లో ఇంకా ఎవరైనా పునరావాస కేంద్రానికి రానివారుంటే వారిని కూడా తీసుకురావాలని సూచించారు. గ్రామంలో పశువులను కూడా తీసుకువస్తే వాటికి అవసరమైన దాణా, త్రాగునీరు సౌకర్యాన్ని అధికారులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. బెస్తగూడెంకు చెందిన బి. కృష్ణార్జున రావు మాట్లాడుతూ పునరావాస కేంద్రంలో ఏర్పాట్లు అన్నీ బాగున్నాయని పేర్కొన్నారు.

వరద ముంపు గ్రామాలలో కలెక్టర్, ఎస్పీ సుడిగాలి పర్యటన

బోటులో బాధితులను కలుసుకున్న కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర కుక్కునూరు/వేలేరుపాడు: పునరావాస కేంద్రాలలో వరద బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సేవలందించాలని అధికారులను కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. వరద కారణంగా ముంపునకు గురైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పలు గ్రామాలలో సోమవారం కలెక్టర్, ఎస్పీ సుడిగాలి పర్యటన చేశారు.వరద నీటిలో మునిగి రహదారి మార్గాలు దెబ్బతిన్న వేలేరుపాడు మండలం తిరుమలాపురం, నార్లవరం గ్రామాల ప్రజలను కలిసేందుకు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిశోర్ తో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి బోట్ ద్వారా వరద ముంపు గ్రామాల ప్రజలను కలిశారు. ఒక్కొక్క కుటుంబానికి 3 రోజులకు సరిపడా బియ్యం, కందిపప్పు,

వంటనూనె, 5 రకాల కూరగాయలు, నిత్యావసర సరుకులను, ప్రతీ ఇంటికి వాటర్ పాకెట్స్ ఒక బస్తా చొప్పున ఇంటింటికి సిబ్బంది అందిస్తున్నారని, ప్రజలకు సక్రమంగా అందుతున్నదా అని ప్రజలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అధైర్యపడొద్దని, బాధితులకు ఎటువంటి నష్టం కలగకుండా జిల్లా యంత్రాంగం మీ వెనుక ఉంటుందని బాధితులలో కలెక్టర్ భరోసా నింపారు. అనంతరం దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీకి చేరుకొని అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు, త్రాగునీరు అందుతున్నదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కష్ట సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారిలో ధైర్యం నింపాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు వరద సహాయం అందించడంలో అధికారులు ఎటువంటి అలసత్వాన్ని ప్రదర్శించవద్దని, నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం కుక్కునూరు చేరుకొని వరద పునరావాస కేంద్రంలో బాధితులకు అందుతున్న సేవలను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఎం. సూర్యతేజ, డిఆర్డిఏ పీడీ ఆర్. విజయరాజు, డిపిఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, డీఎస్ ఓ ఆర్.సత్యనారాయణ రాజు, జిల్లా పౌర సరఫరాల సంస్థ డి ఎం మంజుభార్గవి, తహసీల్దార్ చిన్నారావు, ప్రభృతులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదిక పై రోడ్లపై గుంతలు పూడ్చివేత

విశాలాంధ్ర- కంచికచర్ల: ఊపిరి పీల్చుకున్న కంచికచర్ల ప్రజలు ఇటీవల కురిసినభారీ వర్షాల కారణంగా ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నుంచి భావన థియేటర్ వరకు రోడ్లన్నీ మోకాలి లోతు గుంతలలో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రయాణికులు విద్యార్థినీ విద్యార్థులు పలువురు ఉద్యోగస్తులు పలురకాల ఇబ్బందులు పడుతున్నారని నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య దృష్టికి రావడంతో ఈ సంఘటన పై వర్షపు గుంతలనుపూడ్చివేయమని కోగంటి బాబుకు ఎమ్మెల్యే తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశానుసారం టిడిపి మండల అధ్యక్షులు కోగంటి బాబు బస్టాండ్ సెంటర్ నుంచి భావన థియేటర్ వరకు రోడ్లపై పైబడిన వర్షపు గుంతలను 6 టిప్పర్ల ద్వారా తన సొంతనిధులు వెచ్చించి జి ఎస్ పి కలిపిన దస్తును ఆ గుంతలను సోమవారం పూడ్చి వేసినట్టు మీడియాకు తెలియజేశారు.

వసతి గృహంలో విద్యార్థుల నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్

విశాలాంధ్ర - గుడివాడ : స్థానిక కాకర్ల వీధిలోని బాలుర ఎస్సీ, ఎస్టీ వసతి గృహంలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం సాయికుమార్ కోరారు. ఆదివారం బాలుర ఎస్సీ, ఎస్టీ వసతి గృహం ఏఐఎస్ఎఫ్ గుడివాడ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్ మాట్లాడుతూ హాస్టల్లో ప్రధానంగా ఉన్నటువంటి సమస్య నీటి సమస్య విద్యార్థులు స్నానం చేయాలంటే మంచి నీరు కూడా లేనటువంటి దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ వసతి గృహంలోని బోరు రిపేర్ కావడంతో దాన్ని బాగు చేయించకుండా బయట నుంచి నీరును పైప్ లైన్ ద్వారా హాస్టల్స్‌కి కనెక్షన్ ఇవ్వడం వల్ల నీరు కలుషితమై హాస్టల్‌కి వస్తున్నాయన్నారు. దీనివల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. 12 మరుగుదొడ్లు ఉంటే ఒక్క దాంట్లో కూడా కొళాయి ద్వారా నీరు అందడం లేదన్నారు. విద్యార్థులు నిద్రించడనికి మంచలు లేకపోవడంతో క్రింద నిద్రించడం జరుగుతందని వెంటనే ఈ సమస్యలను వెంటనే ఉన్నత స్థాయి అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా కన్వీనర్ సాదిక్, నాయకులు సన్నీ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

మురారి గ్రామంలో స్వచ్ఛత వారోత్సవాలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మురారి గ్రామంలో సోమవారం గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో స్వచ్ఛత వారోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి వీధి తిరుగుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేకుంటే సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని గ్రామం అంతటా తిరుగుతూ అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలందరూ కూడా సహకరించాలని కోరారు. గ్రామ ప్రజలకి పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకొనేవిధంగా అవగా హన కల్పిస్తున్న సచివాలయ సిబ్బందికి వసంత్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఆర్డీవో

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : కపిలేశ్వరపురం మండలం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలంలోని కేదార్లంక, వీధివారిలంక గ్రామాలను గ్రామ సర్పంచ్ వీధి వెంకటరెడ్డితో ఆర్డీవో సుధా సాగర్ సోమవారం సందర్శించారు. గోదావరి వరద పెరగడంతో జాగ్రత్తగా ఉండాలని ముంపు ప్రాంతాల, ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని, అలాగే పక్వానికి వచ్చిన ఉద్యాన పంటలను రైతులు ముందస్తుగా సమీప మార్కెట్లోకి తరలించు కోవాలని అయిన సూచించారు. వరద సమ యంలో, నీరు ఇళ్లను చుట్టు ముట్ట డంతో పాటు విషపు పురుగులు సంచారం ఎక్కువగా ఉంటుందని, జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఆర్డీఓ సుధా సాగర్ వెంట, ఎండిఓ, స్థానిక విఆర్ఓ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం ... స్తంభించిన ట్రాఫిక్

విశాలాంధ్ర - జగ్గంపేట : నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేట నుండి గోకవరం వెళ్ళే ప్రధాన రహదారిలో భారీ వృక్షం సోమవారం నేలకొరిగింది. దీంతో ఆ రహదారిలో వెళ్ళే భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అల్పపీడన ప్రభావంతో గత రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆ వర్షాలు నేపథ్యంలో చెట్టు వాలిపోయింది. దీంతో కరెంట్ స్థంభం విరిగిపడి విద్యుత్ వైర్లు, కేబుల్ వైర్లు తెగిపడ్డాయి. ఆ ప్రాంతంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. అలాగే ఆ రోడులో వెళ్ళే వాహనాలు నిలిచి పోవడంతో ఎంప్లాయిస్ కాలనీ మీదుగా దారి మళ్లించారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చెట్టును తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు.

పారిశుద్ధ్య పనులపై దృష్టి

విశాలాంధ్ర - తాళ్లపూడి : కొవ్వాడ వరద నీరు, వర్షం నీటి తాకిడి తగిలిన అన్నదేవరపేట గ్రామంలోని జాన్‌పేటపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక అధికారులు పారిశుద్ధ్యం పై దృష్టి సారిస్తున్నారు. ఇరిగేషన్ ఏ.ఈ కొండలరావు వరద నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనాలు తీసుకుం టున్నారు. నిన్నటి కంటే నీటి ఉధృతి తగ్గటంతో ఆ ప్రాంతంలో శానిటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక సచివాలయం అద్వర్యం లో బ్లీచింగ్ చెల్లించే కార్యక్రమన్ని చేపట్టారు. ఆరోగ్య శాఖ అధ్వర్యంలో డాక్టర్ తో సహా సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య సలహాలు, మందులు అంద చేశా రు. కొవ్వూరు డిఎల్పీఓ అమ్మాజీ స్థానిక పరిస్థితులును పరిశీలించారు. ఆమె వెంట కార్యదర్శి వీరన్న, సచివాలయ సిబ్బంది తదితరులు వున్నారు.

వరదలపై ముందస్తు చర్యలేవి

-మల్లాడి సత్తిబాబు

విశాలాంధ్ర - యానాం : యానాంలో ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల భద్రాచలం, ధవలేశ్వరం వద్ద రికార్డు స్థాయిలో వరద ఉధృతంగా ప్రవహిస్తుందని దీనివల్ల దిగువ ప్రాంతమైన యానాం వద్ద వృద్ధ గౌతమి గోదావరి నదికి వరద నీరు చేరుకోవడంతో ప్రజా పనుల శాఖ అధికారులు ముందస్తు చర్యలు ఎందుకు చేపట్లేదని యానాం కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మల్లాడి సత్తిబాబు అధికారులను నిలదీసారు. స్థానిక బాలయోగి నగర్, ఓల్డ్ రాజీవ్ నగర్, ఫెర్రి రోడ్డు, వెంకటరత్నం నగర్, ఫరంపేట, అయ్యన్న నగర్ తదితర ప్రాంతాల్లోని వరద నీరు చేరుకుని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కునే పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. గత ఏడాది సంభవించిన వరదలకు నష్టపోయిన బాదితులకు ప్రభుత్వం కేవలం 5500 ఇచ్చి చేతులు దులిపుకుందని సుమారు పదివేల కుటుంబాలకు ఒక్క కుటుంబానికి లక్ష యాభై వేలు నుండి 3 లక్షల రూపాయలు వరకు నష్టం వాటిల్లిందని దీనికి బాధ్యులు ఎవరన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి గత ఏడాది పరిస్థితి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలెవరికీ వరదల వల్ల నష్టాలు కానీ, ఇబ్బందులు గాని ఏర్పడకుండా చూడాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో స్వచ్ఛ భారత్ వారోత్సవాలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పలు గ్రామాల్లో స్వచ్ఛభారత్ వారోత్సవాలు నిర్వహించారు. గజ్జనపూడిలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వైద్య సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కలిసి స్వచ్ఛభారత్ మన అందరి బాధ్యత మన ఊరు శుభ్రత మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో వీఆర్వో దేవత, వెల్ఫేర్ అసిస్టెంట్ సూరిబాబు, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఎమ్ఎల్‌హెచ్ పి కిరణ్ బేబి, సర్వేర్ సునీత, అంగన్వాడి టీచర్లు అప్పల నరస, పార్వతి, లోవ లక్ష్మి, ఆశా వర్కర్లు రాణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర- కాత్రేనికోన : చెయ్యేరులోని శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం తరగతుల్ని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివిఎస్ఎస్ వర్మ, కళాశాల ప్రిన్సిపాల్ డా ఎం.శ్రీనివాస కుమార్ సంయుక్తంగా సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివి ఎస్ఎస్ వర్మ మాట్లాడుతూ విద్యా ప్రమాణాలతో బాషిలుతున్నశ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ప్రవేశించిన విద్యార్థిని విద్యార్థులు, కళాశాలలో గల మౌలిక వసతులు సద్విని యోగం చేసుకొని ఉజ్వల భవిత అందిపుచ్చుకొనవలెనని ఉద్బోధించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా ఎం శ్రీనివాస కుమార్ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ ప్రతి విద్యార్థి మొదటి సంవత్సరం నందే సమున్నత లక్ష్యాన్ని నిర్దేహించుకుని, పరిశోదన ఆత్మక దృక్పధంతో ఆంగ్ల భాష నైపుణ్యం సంబంధిత సబ్జెక్టుల యందు అనువర్తిత నైపుణ్యం సాధించుట ద్వారా గేట్ వంటి ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షల్లోనూ, ప్రాంగణ ఎంపిక నియామకములులో సమున్నత ఫలితాలు సందిం చవచ్చునని పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ప్రసంగం ద్వారా దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి రత్నరాజు, కళాశాల విద్య శాఖాధికారిని డా ఎస్ జయ లక్ష్మి వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నుండి దిగువకు విడుదల చేస్తున్న నీటి పరిమాణం 10 లక్షల క్యూసెక్కులకు చేరిందని మొదటి ప్రమాద హెచ్చరికను ఇప్పటికే జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలి పారు. సోమవారం స్థానిక మండల పరిధిలో గురజాపులంక గ్రామంలోని ముంపు ప్రాంతాలను మోటార్ బోర్డు మీద పయనించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గోదావరి వరద ముంపు బారిన పడే మండలాలలోని గ్రామా లన్నిటిని సందర్శించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే వివిధ మండలాలలోని వరద ముంపు గ్రామాలను గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్య లను మండల ప్రత్యేక అధికారులు, గ్రామ స్థాయి అధి కారులు సమన్వయంతో చేపట్టడం జరిగిందన్నారు. 11 లక్షల క్యూసెక్కుల మీరు దిగువకు క్రాస్ అయినప్పుడు రెండో ప్రమాద హెచ్చరిక విడుదల చేస్తారని అప్పుడు వరద ముంపువల్ల గ్రామాలలో రాకపోకలు స్తంభించిన పక్షంలో ఆయా ప్రాంతాల ముంపు బాధితులను మోటార్ బోట్లు లైఫ్ జాకెట్లు సహాయంతో పునరావాస్ కేంద్రాలకు తరలించి కనీస వసతి సురక్షిత త్రాగునీరు, భోజన సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. స్థానిక మండల పరిధిలోని ఠాణేలంక పరిసర ప్రాంతాలలో పశువులను కూడా రెండో హెచ్చరిక వెలువడిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఇప్పటికే ముంపు బారిన పడే అవకాశం ఉన్న గ్రామాలలోని ప్రసవ తేదీలు 15 రోజులు లోపు ఉన్న గర్భిణీలు, మంచానికే పరిమితమైన దీర్ఘకాలిగ్రస్తులను సురక్షితంగా సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించడం జరిగిందన్నారు. ముంపు గ్రామాలలో ముంపు బాధితులకు సంబంధించి ప్రతి అంశానికి ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయడానికి సిద్ధపరిచారన్నారు. ముంపు బాధితులు తమకు అవసరాలను గ్రామస్థాయి అధి కారులకు తెలియజేస్తే వాటిని సమకూర్చడం జరు గుతుందని ఆయన స్పష్టం చేశారు. ముంపు గ్రామాలలో కొన్ని శిథిలావస్థకు చేరిన కల్వర్టులను గుర్తించి, వాటి వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పా టు చేశామని, పల్లపు ప్రాంతాలలో నీట ముని గిన రోడ్లు, వంతెనలకు సంబంధించి రోడ్లకు ఇరువైపులా రోడ్డు గుర్తింపు కొరకు జెండాలు పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి అధికారులు అమర్చారని తెలిపారు. ముంపు ప్రభావిత గ్రామాలలో ముంపు బాధితులు ఎవ్వరూ ఆం దోళన చెందవలసిన పనిలేదని ప్రభుత్వపరంగా ఆదుకోంటామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు వరదల మూలంగా కోతకు గురయ్యే రోడ్ల వివరాలను తెలిపామని, వాటి పటిష్టతకు ప్రభుత్వ పరంగా శాశ్వత ప్రాతిపదికను చర్యలు గైకొనడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్ మధుసూదన్, మండల స్థాయి సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య గ్లోబల్ స్కూల్లో అవగాహనా సదస్సు

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్, సూరంపాలెంలో చదువుతున్న బిజినెస్‌స్కూల్ విద్యార్థులకు ఎక్సెల్ స్కిల్స్ ఫర్ డేటా అనలిటిక్స్ అనే అంశం పై అవగాహనా సదస్సు/వారాంతపు సదస్సును 22వ తేదీన జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ డా సుగుణ రెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అవగాహన చర్చలో ముఖ్యవక్తగా సుభాష్ తేజ్ ప్రత్యేక విభాగాధిపతి, హైదరాబాద్ వారి సారథ్యంలో డేటా ఎనాలిసిస్, డేటా లోడింగ్ మరియు డేటా విజ్యులిజషన్ అంశములు చర్చించి వాటిపై అవగాహనా సదస్సు జులై 27వ తేదీ వరకు జరుగుతాయని ప్రిన్సిపాల్ సంజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్ డా సంజయ్ కుమార్ విభాగాధిపతి-గోవర్ధన్ రెడ్డి, చార్టర్ కౌన్సిలర్ నవీన్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

విష జ్వరాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

విశాలాంధ్ర - రాజోలు : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాజోలు పరిసర ప్రాంతాల్లో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటంతో ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. రాజోలు నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో ప్రభలుతున్న విష జ్వరాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రాజోలు పరిసర ప్రాంతాల్లో ఎక్కువ మంది ప్రజలు విష జ్వర పీడుతులౌతున్నారు. రాజోలు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రితో పాటుగా ప్రవేట్ ఆసుపత్రుల్లో విష జ్వరాలతో పాటుగా జలుబు, దగ్గుతో బాధపడుతూ ట్రీట్మెంట్ తీసుకుంటున్న రోగుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ముఖ్యంగా గ్రామాలలో అపరిశుభ్ర ఎక్కువగా ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా నియోజకవర్గంలో ఉన్న అన్నీ గ్రామ పంచాయితీల సిబ్బంది ముందస్తుగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లడం, మురుకి నీటి గుంటల్లో దోమల నివారణ మందులు చల్లడం వంటి పనులపై పంచాయితీల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా చూడటానికి అవసరమయ్యే అన్నీచర్యలు చేపట్టే విధంగా ప్రభుత్వ యంత్రాంగంతో పాటుప్రజా ప్రతినిధులు కూడా కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆదేశాల మేరకు ప్రత్తి పాడు కోర్టు హాల్లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, మరియు కారు నడిపే ప్రతి ఒక్కరు సీటు బెల్టు ధరించాలని అన్నారు. సామాజిక భద్రత మనందరి బాధ్యత అని తెలియజేశారు. ప్రత్తిపాడు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రత్తిపాడు జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ కాటం భాను సమక్షంలో పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు, పెద్దాపురం డిఎస్పి లతా కుమారి మరియు ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ కుక్కుటేశ్వరరావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొంగులూరి మధుబాబు, న్యాయవాదులు, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానెల్ సభ్యులు బుగతా శివ, ఏ దేవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర - గండేపల్లి : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని గండేపల్లి ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామ కార్యదర్శి తరంగిణి ఆధ్వర్యంలో స్వచ్ఛత వారోత్సవాల కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామ ప్రజలందరూ కూడా సహకరించాలని కోరారు. గ్రామ ప్రజలకి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనేవిధంగా అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఉన్న పాఠశాలలకు ర్యాలీగా వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పించి, డ్రాయింగ్ మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్ బాబు, ఈవోపిఆర్ డి మూర్తి, తరంగిణి, ఎంపీటీసీ దారపల్లి శివ గోవింద్, కురుకూరి వీర వెంకట చౌదరి, దార బల్ల సద్గురుమూర్తి, పరిమి సత్తిబాబు, కందుల జెమ్మి, తంగెళ్ళ అప్పారావు, టిడిపి జనసేన అభిమానులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - ఏలేశ్వరం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ ప్రత్యేక అధికారి మల్లికార్జునరావు అన్నారు. ఈ మేర కు వివిధ శాఖల ఉద్యోగులు ఆరోగ్య సిబ్బంది నిర్వహించిన పరిసరాల పరిశుభ్రత ర్యాలీని ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలు దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఏలేశ్వరంలోని ప్రజలు, వ్యాపారులు, హెటల్స్ యజమానులు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కె శివ ప్రసాద్, మేనేజర్ శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు, మెప్మా, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ప్రజలు గోదావరి వద్దకు వెళ్లొద్దు

విశాలాంధ్ర - ఆలమూరు : గోదావరి ఎగువ పరీవాహక ప్రాంతాలలో భారీవర్షాల కారణంగా గోదావరి నదికి వరదలు వచ్చే అవకాశం ఉండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండి, గోదావరి చెంతకు వెళ్ళవద్దని ఆలమూరు తాసిల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో మేరీరోజ్, అగ్రికల్చర్ ఏడి నాగేశ్వరరావు, ఆలమూరు ఎస్సై శ్రీనునాయక్ తెలిపారు. కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, బడుగువానిలంక వరద ప్రభావిత ప్రాంతాలను సోమవారం వారు పరిశీలించారు. ప్రస్తుతం ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి నీటిమట్టం గంట గంటకు పెరగడంతో పాటు మొదటి ప్రమాద హెచ్చరికతో ఉగ్రరూపం దాల్చిందని, గోదావరికి వరద మరింత పెరిగే అవకాశం ఉందని లోతట్టు ప్రాంతాల ప్రజలు పోలీసులకు సహకరించాలని అన్నారు. గోదావరికి వరద క్రమేపీ పెరుగుచున్నందున ప్రజలు సందర్శనార్థం గోదావరి గట్టు వైపు వెళ్ళటం ప్రమాదకరమని, జాలరులు, చేపల వేటకు గోదావరిలోకి వెళ్లవద్దని అన్నారు. అలాగే కట్టెల కొరకు ఎవరైనా గోదావరిలోకి దిగితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పెట్రో సంస్థల పాపం ... కోనసీమకు శాపం

- నదీపాతానికి గురవుతున్న లంక భూములు
- ఆందోళనలో కోనసీమ ప్రజలు

విశాలాంధ్ర - అమలాపురం : రిలయన్స్, గుజరాత్ పెట్రోలియం సంస్థలు కార్యకలాపాలు వల్ల యానం గోదావరి నదిని సముద్రమార్గానికి అనుసంధానం చేస్తూ డ్రెడ్జింగ్ యంత్రాలతో ఇసుక తోడేయడం వల్ల విపరీతంగా లంక భూములు నదీ గర్భంలో కనుమరుగవుతున్నాయని రైతులు, పర్యావరణ వేత్తలు సామాజిక కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా ఎదుర్లంక, కమిడివారిపేట, రామాలయం పేట సమీపంలో సుమారు 70 ఎకరాల మేరకు పెరుగులంక భూములు డి పట్టా భూములు నదీ పాతం అయిందని డి పట్టా రైతులతోపాటు, వెరైటీ భూములు రైతులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యానం వైపు పటిష్టమైన రివిట్మెంట్ నిర్మించుకొని రిలయన్స్ సంస్థ ద్వారా పర్యాటక అభివృద్ధిని సాధించుకున్న గత ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు కాగా, ముమ్మిడివరం నియోజవర్గంలో ఉన్న ఎదుర్లంక వైపు కనీసం రక్షణ చర్యలు చేపటకపోవడం పట్ల సముద్ర వత్తిడికి పెరుగులంకలు డి పట్టభూములనే మింగేస్తున్న సముద్రం భవిష్యత్తులో కోనసీమలో ఉన్న గ్రామాలకు గ్రామాలనే కబలిస్తుందని భయపడుతున్నారు. ఆయిల్ సంస్థలు వాటి కార్యకలాపాల నిర్వహణకు గోదావరి మట్టాన్ని సముద్రం మట్టాన్నికి అనుసంధానం చేసేలా మట్టాన్ని భయంకరంగా తవ్వేయటం వల్ల ఎప్పటికైనా కొనసీమకు ముప్పేనని పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి మట్టాన్ని సముద్ర మట్టంతో అనుసంధానం చేయటం వల్ల సముద్ర అలలు గోదావరి పాయల్లోకి ఎగదన్నుతుండతంతో అలల తాకిడికి గోదావరి పాయ ల్లో చేపల వేట సాగించే మత్స్యకారులకు కష్టసాధ్యంగా మారింది. పడవలు బోటులు తరచూ ప్రమాదాల మారిన పడి చేపల వేట కష్టంగా మారి బోట్లు తిరగబడి పలువురు మృత్యువాత పడుతున్నారని భయపడుతున్నారు. దవిలేశ్వరం నుండి విస్తరించి గౌతమి, వశిష్ఠ వైనతేయా పాయలుగా విడిపోయి సముద్రంలో కలు స్తున్న అఖండ గోదావరి పాయల్లో ఉన్న లక్షలాది ఎకరాల లంక భూములు గోదావరి ఉధృతికి కోతకు గురై పెద్దవారి ఏటిఎంలుగా పిలువబడే వేలాది కొబ్బరి చేట్లు నదీ పాతానికి గురై గంగలో కలిసిపోతున్నాయి. 2009లో అప్పటి అమలాపురం ఎంపీ జీవీ హర్ష కుమార్, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ ఎదురు లంక రివిట్మెంట్ కోసం 10 కోట్లు, కొత్తలంక రివిట్ మెంట్ నిర్మాణానికి 7 కోట్లు మంజూరు చేయడం జరి గింది. అయితే అప్పట్లో అత్యంత ప్రమాదకరంగా ఉన్న తాళ్ళరేవు మండలం పిల్లంక ఏటిగట్టుకు ట్రీట్మెంట్‌తో పాటు గ్రోయిన్స్ నిర్మించారు. అప్పటి నుండి లంక భూములు పరిరక్షణపై నాయకులు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా విలువైన లంక భూములు నదిపాతం అవు తున్నాయని కర్రీ వానిరేవు, కొత్తలంక, మర్లపాలెం, గ్రామాలకు డి పట్టారైతులు, జిరాయితీ రైతులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. సిసిఎఫ్ సొసైటీ ప్రెసిడెంట్ వాకపల్లి రామకృష్ణ, కర్రీవాని రేవు గ్రామ సర్పంచ్ కాశి భాగ్య లక్ష్మి, జగపతిరావు, లంక భూములు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

మేధస్సును పెంపొందిస్తుంది

విశాలాంధ్ర - గోపాలపురం : తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండల పరిషత్ ప్రాథమిక ప్రత్యేక పాఠశాల గోపాలపురంలో "నెప్ 2020 నాల్గవ వార్షికోత్సవం" సందర్భంగా"శిక్షా సప్తాహ" మొదటి రోజులో భాగంగా "స్థానిక వనరులతో బోధనోపకరణాల ప్రదర్శన" ప్రధానోపాధ్యాయులు టీ వీ.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం ఈఓ జి. శ్రీనివాస రావు. మహేశ్వర రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించే పాఠాలు సులభతరం చేయడానికి, విద్యార్థులలో సృజనాత్మకతను పెంచడానికి, ఈ నూతన విద్యా విధానం ఎన్ ఈ పి 2020 ని పాఠశాల స్థాయి వరకు తీసుకురావడమే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవడానికి కూడా ఈ ప్రోగ్రాం ఎంతగానో దోహదపడుతుందన్నారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టి ఎల్ ఎం) ఎగ్జిబిషన్ విద్యార్థులలో మేధస్సును పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ. మహేశ్వరరావు ఉపాధ్యాయులు షేక్ హిదయతుల్లా, అమలాపురపు వెంకటేశులు, ఎం హితవచని, పైడి సురేష్ బాబు సిఆర్పి కొయ్య నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసుపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర - కరప : ప్రేమ జంట మిస్సింగ్ కేసుపై కరప తహశీల్దార్‌కు గ్రీవెన్స్‌లో కెవివి లక్ష్మి ఫిర్యాదు చేయడం జరిగింది. కరప స్టేషన్ నందు 26-6-2024న ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు కావడంతో ఎస్సై రామకృష్ణ కేసు వివరాలు తహశీల్దార్‌కు తెలియజేశారు. కరప మండ లం కొంగుదు గ్రామానికి చెందిన కేవీపీ లక్ష్మి తమ తల్లిదండ్రులకు రెండవ సంతానంగా పుట్టానని కాకినాడ ఐసిఐసిఐ బ్యాంక్ నందు లోన్స్ విభాగంలో పని చేసే దానిని అదే బ్యాంకులో పనిచేసిన పట్నాల బాలకృష్ణతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారిందని అతనిని పెళ్లి చేసుకునేందుకు మా తల్లిదండ్రులతో చెప్పగా వద్దని మా తల్లిదండ్రులు వారించడంతో నేను బ్యాంకు డ్యూటీకి అని చెప్పి పట్నాల బాలకృష్ణతో రాజమండ్రి వెళ్లి జాంపేట వద్ద ఉన్న రామాలయంలో పెళ్లి చేసుకోవడం జరిగిందని కేవివి లక్ష్మీ పేర్కొన్నారు. ఇదంతా నా ఇష్టపూర్వకంగా జరిగిందని ఖితపూర్వకంగా తాసిల్దార్‌కి అందించిన ఫిర్యాదుల పేర్కొన్నారు. మా తల్లిదండ్రులు మా తండ్రి వీఆర్వోగా దూరంగా గ్రామంలో పనిచేస్తున్నారని నేను రెండో పెళ్లి వాడైన పట్నాల బాలకృష్ణ పెళ్లి చేసుకోవడం మా తల్లిదండ్రులకు నచ్చక పోవడంతో ఉమెన్ మిస్సింగ్ కేసు కాకినాడ జే కేసీలో పెట్టడం జరిగిందని ఈ కేసులో నిజంలేదని కేవీవీ లక్ష్మీ పేర్కొన్నారు. దీనిపై కేవీపీ లక్ష్మి మా తల్లిదండ్రులు పెట్టిన మిస్సింగ్ కేసు వాస్తవం కాదని లిఖితపూర్వకంగా తాసిల్దార్ వి రామకోటేశ్వరరావుకు దరఖాస్తు చేశారు. దీనిపై ఎస్సై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని లక్ష్మి కోరింది.

కండి కాలువను పరిశీలించిన తుమ్మలపల్లి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం జడ్ రాగంపేట గ్రామంలోని కండి కాలువను జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ సోమవారం పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ జడ్ రాగంపేట నుంచి నాయకంపల్లి వెళ్లే దారిలో ఉన్న కండి కాలువ గుండా అనేక మంది రైతులు తమ పొలాలకు వెళుతుంటారన్నారు. ప్రస్తుతం ఈ కండి కాలువ అధిక వర్షాలతో పొంగి పొర్లుతుండడంతో రైతులు తమ పొలాల్లోకి వెళ్లే పరిస్థితి లేదని అన్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో వ్యవసాయం సంబంధించిన పనిముట్లు, ఎరువులు తీసుకు వెళ్లే పరిస్థితి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. మూడు గ్రామాల రైతులు ఈ కండి కాలువ దాటుకుని తమ వ్యవసాయ పొలాలకు వెళ్లాలని దీనివల్ల రైతులందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ కండి కాలువ వలన పాడి రైతుల ఇబ్బందులు మరీ ఎక్కువ అని అన్నారు. పాడి రైతులు పాడి పశువులకు గడ్డి కోసుకుని నెత్తి మీద బరువుతో ఈ కాలువ దాటుకుని రావడం అంటే వారి కష్టం వర్ణించలేనిది అని అన్నారు. వెంటనే విషయాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దృష్టికి, కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ దృష్టికి, ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూరంపాలెం బాలు, గోకాడ ప్రసాద్, కాయల మణికంత, పాలెం బాబి, జన సైనికులు పాల్గొన్నారు.

శాంతి కళ్యాణం

విశాలాంధ్ర-అవనిగడ్డ : స్వామి వారి శాంతి కళ్యాణం కనుల పండుగగా నిర్వహించారు. మండల పరిధిలోని పులిగడ్డ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శాంతి కళ్యాణం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి శాంతి కళ్యాణం తిలకించి స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ధర్మకర్త యార్లగడ్డ శ్రీనివాసరావు భక్తులకు కావలసిన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.